సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం ၊ 22 ၊ ఏప్రిల్ ၊ 2025



డిజిటల్ భవిష్యత్తుకు ఏఐ

గంభీరావుపేట: డిజిటల్ భవిష్యత్ ఏఐపైనే ఆధారపడి ఉంటుందని రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు.

- వివరాలు 8లో▸



కోర్టులో చలివేంద్రం ప్రారంభం

సిరిసిల్లటౌన్: స్థానిక ఫస్ట్‌క్లాస్ అడిషనల్ కోర్టు ప్రాంగణంలో చలివేంద్రాన్ని సోమవారం జూనియర్ సివిల్ జడ్జి సృజన ప్రారంభించారు. శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
39.0/28.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. కానీ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

లారీలు రావు.. కాంటా పెట్టరు !

- సర్దాపూర్ ఏఎంసీ గోదాం వద్ద అన్‌లోడింగ్ తిప్పలు
- ఇప్పటికే వడ్లతో నిండిపోయిన గోదాములు
- ధాన్యం కొనుగోళ్లకు కష్టకాలం
- మొగులు చూస్తే రైతు గుండెల్లో గుబులు



ఇది ముస్తాబాద్ మండలం గూడెం. రైతులు పది రోజుల క్రితం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చి ఆరబెట్టగా తేమశాతం వచ్చింది. దీంతో బస్తాల్లో నింపి తూకం వేశారు. కానీ వడ్లను తరలించేందుకు లారీలు రాకపోవడంతో తూకం నిలిపివేశారు. లారీలు వస్తేనే, తూకం వేసి బస్తాలు రవాణా చేస్తేనే కొత్తగా వరుస క్రమంలో తేమశాతం వచ్చిన వడ్ల కుప్పలను తూకం వేస్తామని ఐకేపీ సెంటర్ల నిర్వాహకులు తేల్చి చెబుతున్నారు.



ఇదీ.. సిరిసిల్ల పట్టణ శివారులోని సర్దాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో గోదాముల వద్ద వడ్ల లారీలు. ఒక్కటి.. రెండు.. కాదు.. ఏకంగా వందలారీలు ఇలా వడ్ల బస్తాల లోడ్‌లతో నాలుగు రోజులుగా ఉంటున్నాయి. హమాలీలు ఉన్నా సరిపోక అన్‌లోడింగ్ కోసం రోజుల తరబడి నిరీక్షిస్తున్నాయి. మరోవైపు గోదాములు సైతం వడ్లబస్తాలతో నిండిపోయాయి. ఇక్కడ ఇంకా వడ్లను నిల్వ చేసేందుకు స్థలం లేని పరిస్థితి.



ఇవీ తంగళ్లపల్లి మండలంలో ఆరబోసిన వడ్లకుప్పలు. తేమశాతం రావడంతో అకాల వర్షాల భయంతో కొందరు రైతులు వడ్లకుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పగా.. మరికొందరు కవర్లు లేక అలాగే వదిలేశారు. ఒక్క వర్షం పడినా వడ్లు తడిసిపోతాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. లారీలు రాక.. వడ్లు కాంటా పెట్టడం లేదు.

సిరిసిల్ల: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సవాలక్ష అడ్డంకులు ఎదురవుతున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి వారం, పది రోజులు గడుస్తోంది. చాలా మటుకు తేమశాతం కూడా వచ్చింది. అయితే తూకం వేసిన ధాన్యాన్ని లారీల్లో గోదాముల వద్దకు పంపిస్తే రోజులకొద్దీ అన్‌లోడింగ్ కావడం లేదు. ఫలితంగా లారీలు ఖాళీ కాకపోవడంతో కేంద్రాల్లోని ధాన్యం కుప్పలుగా పేరుకుపోతుంది. జిల్లా శివారులోని సర్దాపూర్ ఏఎంసీ గోదాములు నిండిపోయి వంద లారీలు నిలిచిపోయాయి. జిల్లాలో 36 బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉండగా... నలుగురు మాత్రమే ధాన్యం దింపుకునేందుకు బ్యాంకు గ్యారంటీ ఇచ్చారు. మిగతా 32 రైస్‌మిల్లులు బ్యాంకు గ్యారంటీ ఇవ్వలేదు. రా రైస్‌మిల్లులు సీఎమ్మార్ బియ్యం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో వడ్లను కేటాయించలేదు. దీంతో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు అస్తవ్యస్థంగా మారింది. మరోవైపు అకాల వర్షాలు రైతులను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

ధాన్యం సేకరణ ప్రణాళిక

వరి సాగు	1,78,350 ఎకరాలు
దిగుబడి అంచనా	3.67 లక్షల మెట్రిక్ టన్నులు
మద్దతు ధర (క్వింటాలుకు..)	'ఏ' గ్రేడ్‌కు: రూ.2,320, కామన్ రకానికి: రూ.2,300
కొనుగోలు కేంద్రాలు	241
ఇప్పటి వరకు ప్రారంభించిక కేంద్రాలు	239
కొనుగోళ్లు ప్రారంభించిన కేంద్రాలు	179
కొనుగోలు చేసిన ధాన్యం	12,203.720 మెట్రిక్ టన్నులు
గోదాముకు చేరిన ధాన్యం	7,785.060 మెట్రిక్ టన్నులు
వడ్లను అమ్ముకున్న రైతులు	1,707

రెండు ఎకరాలు కోసిన



రెండెకరాల పొలం కోసి పది రోజులైంది. వడ్లు ఆరినయి. లారీలు రావడం లేదని రెండు రోజులుగా కాంటా పెడుతలేరు. మొగులు చూస్తే చెడగొట్టు వానలు పడుతాయని భయమవుతుంది. తొందరగా లారీలు పంపించి వడ్లను జోకాలి. రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– శివరాత్రి ఎల్లయ్య, గూడెం

వంద లారీలు ఆగిపోయాయి



సర్దాపూర్ గోదాములో వందలారీలు అన్‌లోడింగ్ కోసం ఉన్నాయి. నాలుగు రోజులుగా లారీలు లోడింగ్‌తోనే ఉంటే టైర్లు దెబ్బతింటాయి. మాకు ఆర్థికంగా నష్టం వస్తుంది. హమాలీల సంఖ్య పెంచాలి. గోదాముల్లో జాగ లేదంటున్నారు.

– రఫిక్, లారీ యజమాని, సిరిసిల్ల

వడ్లు ఆరినయి



నాకు ఎకరం కంటే కొంచెం ఎక్కువ భూమి ఉంది. మరో ఎకరమంత కొలుకు తీసుకుని వరి వేసిన. వరి కోసి వారం దాటింది. వడ్లు ఆరినయి. అయినా ఇంకా వడ్లను నేర్పుతూనే ఉన్నా. వడ్లు జోకినా లారీలు రాక ఎక్కడి బస్తాలు అక్కడే ఉన్నాయి. రైస్‌మిల్లులకు వడ్లు కేటాయించలేదట.

– పోచంపల్లి మల్లయ్య, పెద్దూరు

మిల్లర్లు ముందుకొస్తున్నారు



జిల్లాలో రైస్‌మిల్లర్లు ఒక్కొక్కరుగా బ్యాంకు గ్యారంటీ ఇస్తూ ముందుకొస్తున్నారు. బ్యాంకు గ్యారంటీ ఇచ్చిన వారికి వడ్లను కేటాయిస్తాం. రా రైస్‌మిల్లులకు ఈ సీజన్ వడ్లు కేటాయించం. బాయిల్డ్ రైస్‌మిల్లులకే ఇస్తాం. సర్దాపూర్ గోదాములో లారీలు అన్‌లోడింగ్ సమస్యను పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పర్యవేక్షిస్తారు. రైతులకు ఇబ్బంది కాకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం.

– పి.వసంతలక్ష్మి, డీఎస్‌వో

న్యూస్‌రీల్

కాంటా ఎప్పుడు పెడతారు



ముస్తాబాద్‌లో రైతుల నిరసన

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. ధాన్యం కాంటా పెట్టడం లేదని.. ఎప్పుడు పెడతారో చెప్పాలంటూ నిరసనకు దిగారు. ధాన్యం ఎప్పుడు జోకుతారో తెలియని పరిస్థితి ఉందన్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రంలో మండుటిండల్లో పడిగాపులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎంసీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి రైతులకు మద్దతు పలికారు. రైతులు బాలెల్లు, తాళ్ల రాజు, కర్రె మైసయ్య, శ్రీనివాస్ నిరసన తెలిపారు.

గ్రీవెన్స్ డేకు 25 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకు 25 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ మహేశ్ బీ గీతే మాట్లాడుతూ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

జిల్లా కోర్టుకు నూతన పాలనాధికారులు

సిరిసిల్లకల్చరల్: జిల్లా న్యాయస్థానానికి కొత్తగా ఇద్దరు పాలనాధికారులు బదిలీపై వచ్చారు. మూడో అదనపు జిల్లా జడ్జిగా మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ కోర్టులో విధులు నిర్వహిస్తున్న పి.మాధవి సిరిసిల్ల ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు ముఖ్య పాలనాధికారిగా నియమితులయ్యారు. పెద్దపల్లి జిల్లా కోర్టులో విధులు నిర్వహించిన బొజ్జా వేణుగోపాల్ సిరిసిల్ల మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టుకు పాలనాధికారిగా నియమితులైనట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు.

'డబుల్' బిల్లుల జాప్యంపై ఆందోళన



గంభీరావుపేట(సిరిసిల్ల): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ బిల్లుల జాప్యంపై మండలంలోని దేశాయిపేటలోని లబ్ధిదారులు సోమవారం గ్రామపంచాయతీ ఎదుట నిరసన తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం దేశాయిపేటలో 20 ఇళ్లు మంజూరు కాగా.. ఏడుగురు నిర్మించుకున్నారు. ఇప్పటి వరకు రూ.లక్ష మాత్రమే చెల్లించారని తెలిపారు. మిగతా రూ.4లక్షలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పథకాలు



సిరిసిల్లటౌన్: అంతర్ జిల్లాస్థాయిలో ఉమెన్స్ విభాగం వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సిరిసిల్లకు చెందిన క్రీడాకారిణి నేహ స్వర్ణ పతకాలు సాధించింది. హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఇంటర్ డిస్ట్రిక్ట్ స్థాయి పోటీలు నిర్వహించారు. వీటిలో జిల్లా నుంచి పాల్గొన్న నేహ కేటగిరీ సీనియర్స్ 63కేజీలో పాల్గొని స్వాట్స్ 110 కేజీ, బెంచ్ 47.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 132.5కేజీ విభాగాల్లో బంగారు పతకాలు సాధించింది. కోచ్ తదితరులు నేహను అభినందించారు.

జీపీవోలుగా అవకాశం ఇవ్వాలి

సిరిసిల్ల: జీపీవోలుగా ఆప్షన్స్ పెట్టుకున్న పూర్వపు వీఆర్‌ఏలకు(మున్సిపల్ విభాగంలో సర్దుబాటు కాబడిన) వార్డ్ ఆఫీసర్లకు జీపీవోలుగా అవకాశం ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్(ఏవో) రాంరెడ్డికి సోమవారం వార్డు ఆఫీసర్ల ప్రతినిధులు వినతిపత్రం అందించారు. వార్డు ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు మల్లారం అర్జున్ మాట్లాడుతూ వీఆర్‌ఏలను 2023లో పదోన్నతులతో ఇతర విభాగాల్లో సర్దుబాటు చేశారన్నారు. గ్రామీణ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు గ్రామీణ పరిపాలన అధికారి(జీపీవో) నియమించాలని చూస్తున్నారని వివరించారు. జీపీవోలుగా వీఆర్‌ఏలకు అవకాశం కల్పించాలని కోరారు. రహీం, రాకేశ్, దేవేంద్ర, ఆంజనేయులు, మంజుల, అంజమ్మ, పరశురాం, సుధీర్ ఉన్నారు.

జలవెల!

ప్రాజెక్టు రిపోర్ట్

- అడుగంటుతున్న జలాశయాలు
- ఎల్‌ఎండీ డెడ్‌స్టోరేజీకి రాలేదంటున్న అధికారులు
- ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఎనిమిది టీఎంసీలు
- మిడ్ మానేరులోనూ అదే తీరు
- సాగునీటికి ఇబ్బందులు లేవంటున్న ఇరిగేషన్‌శాఖ



మిడ్‌మానేరులోని నీటిమట్టం

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

రోజురోజుకు పెరుగుతున్న ఎండల కారణంగా ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులు క్రమంగా అడుగంటుతున్నాయి. వరదకాలువ, కాళేశ్వరం నుంచి కొంతకాలంగా ఎత్తిపోతలు లేకపోవడంతో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. ఇప్పటికే పంట కోతలు పూర్తయిన నేపథ్యంలో వ్యవసాయపరంగా ఇబ్బందులు లేవని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు జూన్ వరకు సరిపోతుందని, తాగునీటికి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. దంచికొడుతున్న ఎండల నేపథ్యంలో రోజుకు పదుల సంఖ్యలో క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది. తాగునీటికి ఇబ్బంది వచ్చే పరిస్థితే ఉత్పన్నమవదని, ఆలోపు వర్షాలు వచ్చేస్తాయని ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

లోయర్ మానేరులో ఏడు టీఎంసీలు


లోయర్ మానేరు డ్యాంలో ప్రస్తుతం ఏడు టీఎంసీల నీరు నిల్వఉంది. తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని అధికారులు చెబుతున్నారు. మిషన్ భగీరథకు డెడ్‌స్టోరేజీ 3.8 టీఎంసీలు, కాగా సాధారణ డెడ్‌స్టోరేజీ 2 టీఎంసీలుగా పరిగణిస్తామని తెలిపారు. తాగునీటి అవసరం కోసం ప్రాజెక్టు నుంచి ఇప్పటి నుంచి జూలై నెలవరకు వరకు రోజుకు సుమారు 300 క్యూసెక్కుల నీటిని వాడుకున్నా.. 1.5 టీఎంసీలు అవసరం అవుతుంది. ఇతర అవసరాలకు టీఎంసీ కావాలి. 3.8 టీఎంసీల కన్నా దిగువకు వస్తే ఎలగందుల, పరిసర ప్రాంతాలకు మాత్రం ఇబ్బందిగా మారుతుంది. ఆలోపు వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది.

ఎల్లంపల్లిలో 8.76 టీఎంసీలు


20.175 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం 8.76 టీఎంసీల నీరు ఉంది. గతేడాది ఇదే రోజు 6.75టీఎంసీల నీరు ఉండేది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సుమారు 2టీఎంసీల నీరు ఎక్కువగా ఉండటంతో తాగునీటి అవసరాలకు ఢోకాలేదని సబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ మెట్రోవర్క్ స్కీం (హెచ్ఎండబ్ల్యూఎస్) కోసం 330 క్యూసెక్కులు, రామగుండంలోని ఎన్టీపీసీ పంప్‌హౌజ్‌కు 121 క్యూసెక్కులు, పెద్దపల్లి, రామగుండం మిషన్ భగీరథ పథకం కోసం 58 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మంచిర్యాల జిల్లా ప్రజల తాగునీటి అవసరాల కోసం 23 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఎండల కారణంగా 190 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది. ప్రతిరోజు ప్రాజెక్టు నుంచి 723 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోని నీరు జూన్ వరకు తాగునీటి అవసరాలు తీరుస్తుందని అధికారులు వెల్లడించారు.

మిడ్‌మానేరులో 7.074 టీంఎసీలు

మిడ్‌మానేరు జలాశయం నుంచి పంటలకు, తాగునీటి అవసరాలకు ఇప్పటి వరకు కరీంనగర్ ఎల్‌ఎండీ ప్రాజెక్ట్‌లోకి 20 టీఎంసీల మేర నీరు తరలింది. ఎండలకు రోజుకు 140 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది. జూలై వరకు ఒకటిన్నర టీఎంసీ నీరు ఆవిరి కానుంది. మిడ్ మనేరు ప్రాజెక్ట్ నుంచి సిరిసిల్ల జిల్లాకు రోజుకు మిషన్ భగీరథ కింద 40క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. జూలై 31వరకు మిడ్ మానేరులో తాగునీటి అవసరాలకు నాలుగు టీఎంసీల నీరు నిల్వ ఉంచుతామని అధికారులు పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బంది లేదని మిడ్ మానేరు ప్రాజెక్ట్ ఈఈ జగన్ తెలిపారు. 2024 ఏప్రిల్ 21న ప్రాజెక్ట్‌లో 5.96 టీఎంసీల నీరు ఉంటే ఇప్పుడు 7.074 టీఎంసీల మేర నీరు ఉందని అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ప్రాజెక్ట్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉందన్నారు.




వెలవెలబోతున్న ఎల్‌ఎండీ



ఎల్లంపల్లిలోని తగ్గిన నీరు

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



డీఆర్‌డీవో శేషాద్రికి వినతిపత్రం అందజేత

సిరిసిల్ల: ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట సోమవారం ఉపాధిహామీ ఫీల్డ అసిస్టెంట్లు నిరసన తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేదూరి మధు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పేస్కేలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.25వేలు చెల్లించాలని కోరారు. ఉపాధిహామీల ఉద్యోగుల లాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు 'ఎఫ్‌టీఈ'లుగా కన్వర్టు చేసి వేతనాలు ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన వారికి రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 24న చలో సీఆర్‌డీ హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు జిల్లా డీఆర్‌డీవో శేషాద్రికి వినతిపత్రం అందించారు.

ధర్మగుండంలో ఇలాగైతే ఎలా..

- బట్టలు ఉతుకుతున్న కొందరు భక్తులు
- ఇబ్బందులు పడుతున్న మిగతా వారు



ధర్మగుండం మెట్లపై ఆరబెట్టిన వస్త్రాలు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తరలివస్తుంటారు. దాదాపు అందరూ ధర్మగుండంలోనే స్నానాలు చేసి దర్శనానికి వెళ్తారు. ధర్మగుండంలో స్నానాలాచరించడాన్ని భక్తులు అతి పవిత్రంగా భావిస్తారు. అయితే కొందరి చేష్టలతో మిగతా వారు ఇబ్బందులు పడుతున్నారు. ధర్మగుండంలో స్నానాలు మాత్రమే చేయాల్సి ఉండగా.. విడిచిన బట్టలను సైతం అక్కడే ఉతుకుతూ ఆరేస్తున్నారు. ఇలా ఇతరులు బట్టలు శుభ్రం చేసుకున్న నీటిలోనే స్నానం చేసేందుకు మిగతా భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై అధికారులు భక్తులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దీనిపై శానిటేషన్ ఇన్‌చార్జి పర్యవేక్షకులు వరి నర్సయ్య మాట్లాడుతూ ధర్మగుండంలో బట్టలు ఉతుకకుండా ఇప్పటికే మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నాం. అయినా చాలా మంది అలాగే చేస్తున్నారు. ఇక ముందు ఎవరూ బట్టలు ఉతుకకుండా చర్యలు తీసుకుంటాం.

'కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న స్కైలాబ్‌బాబు

సిరిసిల్లటౌన్: కార్మికులను బానిసలుగా మార్చేలా బీజేపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు విమర్శించారు. మే డే సంబంధించిన కరపత్రాలను సోమవారం సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పనిగంటలు పెంచి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. మే 1న అంతర్జాతీయ శ్రామిక దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో ఎర్రజెండాలు ఎగురవేయాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, ఎగమంటి ఎల్లారెడ్డి, జువ్వాజి విమల, కోడం రమణ, గన్నేరం నర్సయ్య, గణేశ్, పద్మ, రమేశ్ చంద్ర పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): దుమాలలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఇంటికో బోనం చొప్పున ఉదయమే ఆలయానికి తరలివచ్చిన యాదవులు.. అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. ఒగ్గు కళాకారులు పట్నాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అగ్నిగుండంలో నడిచారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో మునిగి ఒకరి మృతి


రషీద్(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): చేపలు పట్టేందుకు వెళ్లి.. వ్యక్తి చెరువులో గల్లంతవగా.. మరొకరు సురక్షితంగా బయటపడ్డ సంఘటన ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు. కొండాపూర్‌కు చెందిన మహ్మద్ రషీద్(45), బాబా(30) గ్రామ శివారులోని పెద్ద చెరువులోకి చేపలు పట్టేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. ఇద్దరు వలతో చెరువులోకి దిగారు. రషీద్ చెరువులో మునిగిపోయాడు. రషీద్ కోసం బాబా ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో గ్రామంలోకి వెళ్లి విషయం తెలిపాడు. గ్రామస్తులు పెద్దచెరువులో రాత్రి ఎంత గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం సిరిసిల్ల నుంచి గజఈతగాళ్లను రప్పించారు. వారు రషీద్ మృతదేహాన్ని బయటకు తీసుకురావడంతో భార్య షెహనాజ్, కూతురు రేష్మ, కుమారుడు రఫీ, బంధువుల రోదనలు మిన్నంటాయి. రషీద్ ఆరు నెలల క్రితమే దుబాయ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మూడేళ్ల క్రితం అదే చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి మహ్మద్ ఎక్రామ్ చనిపోయాడు.

కొనసాగుతున్న టాస్ పరీక్షలు

సిరిసిల్లఎడ్యుకేషన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) ఇంటర్, పదోతరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఉదయం 1,090 మందికి 987 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 41 మందికి 33 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్‌లో పాతకక్షలతో దాడి చేసిన ముగ్గురిపై సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. వెంకటాపూర్‌కు చెందిన మోతె కిరణ్, మోతె ఎల్లవ్వ, మోతె ఎల్లయ్యలపై ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన మోతె సతీష్, మోతె ఎల్లవ్వ, మోతె బాలమణి బండరాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో కిరణ్, ఎల్లయ్య, ఎల్లవ్వలకు తీవ్ర గాయాలయ్యాయి. కిరణ్ ఫిర్యాదుతో సతీష్, ఎల్లవ్వ, బాలమణిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తన పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేయకుంటే చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డ మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన అల్లె రాజును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. వెంకటాపూర్ మాజీ సర్పంచ్ కోల నర్సయ్య గ్రామ శివారులోని 928/బీ సర్వే నంబర్‌లో 1.04 ఎకరాలను అల్లె అన్వేశ్ వద్ద కొన్నాడు. గతంలో భార్యను, కూతురిని చంపి జైలుకు వెళ్లి 9 నెలల క్రితం అల్లె రాజు బయటకు వచ్చాడు. ఈనెల 18న ఆ భూమిలో కోల నర్సయ్య ట్రాక్టర్‌తో చదును చేయిస్తుండగా.. అల్లె రాజు వెళ్లి ఆ భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈమేరకు కోల నర్సయ్య ఫిర్యాదుతో సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట: పొత్తూరు బిక్కవాగు నుంచి ఇసుక తరలిస్తున్న వ్యక్తిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ గతనెల 31న గస్తీ తిరుగుతుండగా పొత్తూరు బిక్కవాగులో అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నాడు. వీరిని చూసి ట్రాక్టర్‌తో సహా ఆకుల తిరుపతి పారిపోయారని ఎస్సై తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. తిరుపతిని సోమవారం రిమాండ్‌కు తరలించి, ట్రాక్టర్ ఇంజిన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు దాటాలంటే భయమే..

- రోజుకో ప్రమాదం.. పోతున్న ప్రాణం
- పూర్తికాని ఫోర్‌లేన్
- నాంపల్లిగుట్ట నుంచి కొదురుపాక వరకు ప్రమాదకరం


రద్దీగా ఉండే కరీంనగర్-సిరిసిల్ల ప్రధానరహదారి రోడ్డు దాటాలంటే భయమే..

వేములవాడఅర్బన్: కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారి వాహనాలతో బిజీగా ఉంటుంది. ఈ రోడ్డును ఆనుకుని ఉన్న గ్రామాలకు చెందిన వారు రోడ్డు క్రాస్ చేసేందుకు ప్రయత్నిస్తూ నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఎప్పుడు.. ఎక్కడ.. ఎవరి ప్రాణం పోతుందో తెలియక భయాందోళన చెందుతున్నారు. ప్రతీ నెల దాదాపు పదికి మించి ప్రమాదాలు జరుగుతున్నాయంటే ఈ రోడ్డుపై పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మధ్యలోనే ఆగిన రోడ్డు

కరీంనగర్ నుంచి కామారెడ్డికి వెళ్లాలంటే ఈ రోడ్డు ప్రధానం. మధ్యలో నాంపల్లి స్టేజీ నుంచి కుడివైపు మళ్లితే వేములవాడకు వెళ్లవచ్చు. రాజన్న భక్తులకు సైతం ఇదే ప్రధాన రహదారి. నిత్యం తిరిగే వాహనాలతోపాటు రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల వాహనాలతో ఈ రోడ్డు బిజీగా మారుతోంది. కరీంనగర్ నుంచి కొదురుపాక వరకు ఫోర్‌లేన్ వేశారు. సిరిసిల్ల నుంచి నందికమాన్ వరకూ ఫోర్‌లేన్ రహదారి పూర్తి చేశారు. నందికమాన్ నుంచి కొదురుపాక మిడ్‌మానేరు వంతెన వరకు దాదాపు 8 కిలోమీటర్ల దూరం మాత్రమే ఫోర్‌లేన్ పూర్తి కాలేదు. ఈ 8 కిలోమీటర్ల మధ్యలోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

వేములవాడ నందికమాన్ నుంచి ఆరెపల్లి వరకు కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న కొడుముంజ, శాభాష్‌పల్లి, శాంతినగర్, నాంపల్లి, అనుపురం, రుద్రవరం, సంకెపల్లి, ఆరెపల్లి గ్రామాల ఇళ్లు రోడ్డును ఆనుకుని రెండు వైపులా ఉన్నాయి. నిత్యావసరాలు, ఇతరత్ర పనుల కోసం గ్రామస్తులు ఇటు నుంచి అటు వైపు వెళ్లాలంటే రోడ్డు దాటాల్సిందే. అయితే ఈక్రమంలోనే ప్రమాదాలు జరుగుతున్నాయి.

తరచూ రోడ్డు ప్రమాదాలు

- గత 15 రోజుల క్రితం అనుపురం గ్రామానికి చెందిన వంశీ రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు.
- అనుపురం గ్రామానికి చెందిన రాజయ్య బైక్‌పై వెళ్తుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు.
- రాజన్న దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో అనుపురం వద్ద ఖాజీపూర్‌కు చెందిన కుటుంబం వెంకటేశ్, రజిత, అభిరామ్‌లను కారు ఢీకొట్టడంతో గాయపడ్డారు.
- ఐదు రోజుల కిత్రం అనుపురం గ్రామానికి చెందిన బండారి శ్రీహరిని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- గతంలో ఆరెపల్లి శివారులో ఇద్దరు, నాంపల్లి శివారులో ఒక్కరు, అనుపురం శివారులో ఇద్దరు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు.

భయంగా ఉంది



కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిలో అనుపురం వద్ద రోడ్డు దాటాలంటే భయంగా ఉంది. వాహనాల రద్దీ చాలా ఉంటుంది. రోడ్డుకు అవతల పక్కన ఉన్న ఇంటికి వెళ్లాలంటే ఆలోచించే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు ఫోర్‌లేన్ నిర్మించాలి.

– మేరుగు శ్రీనివాస్, అనుపురం

పట్టించుకోవాలి



రోడ్డు ప్రమాదాల్లో ఇప్పటి వరకు చాలా మంది చనిపోయారు. డబుల్ రోడ్డును ఫోర్‌లేన్‌గా విస్తరణ చేయాలని చాలా సార్లు అధికారులకు విన్నవించాం. ఇప్పటికైనా అధికారులు రోడ్డును విస్తరించాలి.

– బుర్ర శేఖర్‌గౌడ్, సంకెపల్లి

అంచనాలు పంపించాం

వేములవాడ నందికమాన్ నుంచి కొదురుపాక మిడ్‌మానేరు ప్రాజెక్ట్ వంతెన వరకు డబుల్ రోడ్డును ఫోర్‌లేన్‌గా మార్చేందుకు రూ.50కోట్లతో అంచనాలను గతంలోనే పంపించాం. రోడ్డు మంజూరుకావడంతోనే పనులు ప్రారంభిస్తాం.

– శాంతయ్య, డీఈ, సిరిసిల్ల ఆర్అండ్‌బీ

‘పెద్దింటి’కి అరుదైన గౌరవం


విద్యార్థులకు తన కథలను పాఠాలుగా బోధిస్తున్న పెద్దింటి అశోక్

సిరిసిల్లకల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ కథారచయిత పెద్దింటి అశోక్‌కుమార్‌కు మరో అరుదైన గౌరవం లభించింది. ఆయన రాసిన జిగిరి, గోస, అనగనగా ఓ కోడిపెట్ట అనే కథలను వరంగల్‌లోని శ్రీవిశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు సిలబస్‌గా ప్రవేశపెట్టారు. ఆయా కథలను బోధించే బాధ్యతను కూడా అప్పగించారు. స్వతహాగా ఉపాధ్యాయుడైన పెద్దింటి కళాశాల విద్యార్థులకు కథలను పాఠాలుగా బోధించారు. ఎనిమిది దశాబ్దాల చరిత్ర గల కళాశాలలో రచయితే అధ్యాపకుడై బోధించడం ఇదే తొలిసారి అని ప్రిన్సిపాల్ సానబోయిన సతీశ్ తెలిపారు. తన కథలపై తానే విస్తృతోపన్యాసం ఇవ్వడం మర్చిపోలేని అనుభవంగా పెద్దింటి అభివర్ణించారు. ఈ సందర్భంగా పెద్దింటిని మానేరు రచయితల సంఘం ప్రతినిధులు, కవులు, రచయితలు అభినందించారు.


దాసరి మురళి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేశ్ బీ గీతే

సైబర్ నేరగాడి అరెస్ట్

- ఆన్‌లైన్ సెంటర్లు లక్ష్యంగా దందా
- దేశవ్యాప్తంగా 35 ఫిర్యాదులు
- రూ.45లక్షలు మోసం

సిరిసిల్లక్రైం: దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ సెంటర్లు లక్ష్యంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాడిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే తెలిపారు. మహారాష్ట్రలోని భీవండికి చెందిన దాసరి మురళి మరో నలుగురు ముఠాగా ఏర్పడి ఆన్‌లైన్ సెంటర్లను లక్ష్యంగా చేసుకొని సైబర్‌నేరాలకు పాల్పడ్డారు. నలుగురిని గతంలోనే పోలీసులు అరెస్టు చేయగా దాసరి మురళిని సోమవారం సిరిసిల్లలో అరెస్టు చేశారు. మురళిపై దేశవ్యాప్తంగా 35 ఫిర్యాదులు నమోదుకాగా... రూ.45లక్షల విలువైన సైబర్ నేరాలకు పాల్పడ్డాడు. మురళి భీవండిలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడిపించుకునేవాడు. విలాసాలకు అలవాటుపడి సులభమార్గంలో డబ్బు సంపాదించాలనే ఆలోచనతో తన స్నేహితులు విలేశ్‌పటేల్, చిరగ్ రమేశ్‌పేతడ్, జింతేంద్ర సోమాభాయ్, నిలేశ్ జై సింగ్‌లతో ముఠాగా ఏర్పడ్డారు. మొదట ఆన్‌లైన్ సెంటర్ వ్యక్తులకు కాల్‌చేసి తనని తాను ఉన్నత స్థాయి వ్యక్తిగా పరిచయం చేసుకునేవాడు. ఆన్‌లైన్ లావాదేవీలు ఎక్కువగా ఉంటాయని, తమ వాళ్లతో నగదు పంపిస్తానని.. తనకు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయాలని నమ్మించి డబ్బు కాజేసేవాడు. అలా వచ్చిన సొమ్మును ఐదుగురు పంచుకునేవారు. దీనిలో భాగంగానే వేములవాడ పట్టణ పరిధిలోని అగ్రహారంలోని ఓ ఆన్‌లైన్ సెంటర్‌ను, సిరిసిల్లలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకొని దాసరి మురళి మోసం చేశాడు. బాధితులు వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన వేములవాడ పోలీసులు స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా విలేశ్‌పటేల్, చిరగ్ రమేశ్ పేతడ్, జింతేంద్ర సోమాభాయ్, నిలేశ్ జైసింగ్‌లను గతంలోనే రిమాండ్ చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న మురళి కోసం వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, ఎస్సై రమేశ్, సైబర్ టీమ్ ఆర్ఎస్ఐ జునైద్, కానిస్టేబుళ్లు ఇమ్రాన్, షమీ ఆధ్వర్యంలో స్పెషల్ టీం ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా కోరుట్ల బస్ స్టాండ్ వద్ద అరెస్ట్ చేశారు.



హరహర మహదేవ



వేములవాడ: శివుడికి ప్రీతిపాత్రమైన సోమవారం దాదాపు 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రాకతో వేములవాడలోని వీధులు రద్దీగా మారాయి. ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.

యువకుని ఆత్మహత్యాయత్నం

- పోలీసులు వెంబడిస్తున్నారని భయాందోళన
- చర్చనీయమైన ఫోన్ వాయిస్ రికార్డర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన యువకుడు గడ్డి నరేందర్ సోమవారం రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలు తాళలేక కేకలు వేస్తూ ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీస్తూ వచ్చాడు. చుట్టుపక్కల వారు అప్రమత్తమై అతనిపై చెద్దర్లు కప్పి మంటలు ఆర్పివేశారు. పోలీసులు చేరుకొని అతన్ని 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. యాభై శాతానికి పైగా శరీరం కాలిందని, పరిస్థితులు విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియలేదు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది.

పోలీసులు పట్టుకుపోతారనే భయంతో..

తనను పోలీసులు వెంబడిస్తున్నారని.. ఎల్లారెడ్డిపేట నుంచి బైక్‌పై వస్తున్నానంటూ సెల్‌ఫోన్‌లో మాట్లాడిన మాటలు వైరల్‌గా మారాయి. తాను ఎల్లారెడ్డిపేటలో ఒకరి ఇంటికి వెళ్లి తన తండ్రి మృతికి కారణం మీరేనని తిట్టినందుకే.. వారు పోలీసులకు ఫోన్ చేసి ఉంటారని భయంతో ఒకరితో సెల్‌ఫోన్‌లో మాట్లాడిన మాటలు స్థానికంగా వైరల్‌గా మారాయి. పోలీసులు వచ్చి పట్టుకుపోతారనే భయమేస్తుందంటూ తాను మాట్లాడినట్లు రికార్డు స్థానికంగా చర్చనీయంగా మారింది. అయితే ఆ తర్వాత వెంటనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. ఇటీవల యువకుడి తండ్రి మృతిచెందాడు. యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్

చందుర్తి: పోలీసు విధులకు ఆటంకం కల్పించిన మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన అమరబండ ప్రసాద్‌ను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. మర్రిగడ్డ గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న వారి వివరాలు సేకరిస్తున్న బ్లూ కోల్ట్స్ సిబ్బంది విధులకు ఆటంకం కల్పించాడు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి ప్రసాద్‌ను సోమవారం కోర్టులో హాజరుపర్చగా , 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. గతంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ , భూ వివాదం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలు

సిరిసిల్లకల్చరల్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఓ వ్యక్తి ప్రమాదానికి కారకుడైన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్ష రూ.6వేల జరిమానా విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎ. ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. టౌన్ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వెంకంపేటకు చెందిన ఒగ్గు భూమేశ్ 2018 నవంబర్ 23న పవర్‌లూం పనులు ముగించుకుని రాజీవ్‌నగర్‌నుంచి వస్తుండగా మినీ స్టేడియం సమీపంలో గోవిందుల నరేశ్ తన ఆటోతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భూమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతని భార్య వరలక్ష్మి ప్రభుత్వాసుపత్రికి తరలించింది. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు జరిపిన పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చే శారు. కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో తొమ్మిది మంది సాక్షులను కోర్టు విచారించింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన తర్వాత నరేశ్‌కు రెండేళ్ల జైలు, రూ.6వేల జరిమానాతో పాటు గాయపడిన వ్యక్తికి రూ.50వేల పరిహారం చెల్లించాల్సిందిగా తీర్పునిచ్చారు.

జర్నలిస్టుల పరిస్థితి దుర్భరం

- బీజేపీ అధికారంలోకి వస్తే అన్ని విధాలా ఆదుకుంటాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యలు


కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి గజమాలతో సత్కారం

వేములవాడ: రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి దుర్భరంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాలిసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వేములవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో వస్తే జర్నలిస్టులను ఆదుకుంటామన్నారు. జర్నలిజం అనుభవం లేకున్నా యూట్యూబ్ చానళ్ల ముసుగులో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై త్వరలోనే ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి గతంలో రూ.10 లక్షల మేరకు ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్ అధ్యక్షతన బండి సంజయ్‌ని సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, నాయకులు ప్రతాప రామకృష్ణ, కుమ్మరి శంకర్, వికాస్‌రావు, బీజేయూ జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్, కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.

ప్రసాద్ స్కీంలోకి రాజన్న గుడి

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. ప్రసాద్ స్కీంలో చేర్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కరీంనగర్‌టౌన్: దేశ చరిత్రలో అంబేడ్కర్ ఎదుర్కొన్న అవమానాలు మరెవరూ ఎదుర్కోలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. తన మేధాశక్తిని అణగారిన వర్గాల అభ్యున్నతికి ధారపోసిన మహనీయుడు అని కొనియాడారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీజేపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన సెమినార్‌కు బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేడ్కర్‌ను దళిత జాతికే పరిమితం చేయాలని కాంగ్రెస్ కుట్ర చేసిందన్నారు. చరిత్ర అంటే డూప్లికేట్ గాంధీ కుటుంబానిదే అన్నట్లుగా విపరీతమైన ప్రచారం చేసుకుని ఆయన్ను తక్కువ చేసిందన్నారు. కాంగ్రెస్ తీరుతో విసుగుచెంది రాజీనామా చేసి బయటకొచ్చి ఎన్నికల్లో పోటీ చేస్తే కమ్యూనిస్టులతో కలిసిన రెండుసార్లు అంబేడ్కర్‌ను ఓడించిందన్నారు. డూప్లికేట్ గాంధీ కుటుంబసభ్యులైన నెహ్రూ, ఇందిరా, రాజీవ్ గాంధీలకు భారతరత్న ఇచ్చుకుందన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్రలు చేసిందన్నారు. అంబేద్కర్‌కు భారతరత్న వచ్చేలా చేసిన పార్టీ బీజేపీ అని అంబేడ్కర్ జయంతి రోజు రాష్ట్రీయ సమరసత దినంగా ప్రకటించి 120దేశాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, మానేరు అనంతరెడ్డి, దేవేందర్ రావు, అడవి కుమార్, డాక్టర్ గంగాధర్, రాజేందర్‌రెడ్డి, సోమిడి వేణు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ భవిష్యత్‌కు ఏఐ


నేషనల్ సెమినార్ వేదికపై మాట్లాడుతున్న బాలకిష్టారెడ్డి


సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

- త్వరలో అందరికీ అందుబాటులోకి ‘కృత్రిమ మేధ’
- గంభీరావుపేట డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నేషనల్ సెమినార్
- హాజరైన రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి
- ఆకట్టుకున్న ప్రొఫెసర్ల పవర్ ప్రెజెంటేషన్లు

గంభీరావుపేట(సిరిసిల్ల): డిజిటల్ భవిష్యత్ మొత్తం ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పైనే ఆధారపడి ఉంటుందని తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఫిజికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై నేషనల్ సెమినార్ కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పలు రీసెర్చ్ సంస్థల ప్రొఫెసర్లు పాల్గొని పవర్ ప్రెజెంటేషన్‌లు, ప్యానల్ డిస్కషన్, పోస్టర్ ప్రజెంటేషన్ ద్వారా ఏఐ గురించి వివరించారు.

సెమినార్‌లో ఏం చెప్పారంటే..

డిజిటల్ భవిష్యత్‌కు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) దోహదపడుతుందన్నారు. సాంకేతిక విప్లవాన్ని ముందుకు సాగించే క్రమంలో త్వరలోనే కృత్రిమ మేధ ప్రజలకు అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా సాధారణ పౌరుల జీవితాలపై సానుకూల ప్రభావం చూపుతూ వారి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఏఐ టెక్నాలజీని వినియోగించుకొని విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకుంటూ విద్యార్థులు డిజిటల్ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, రీసోర్స్ పర్సన్‌లు కల్యాణి, స్వాతి మాతూర్, హంట్ మెట్రిక్ సీఈవో అయూబ్ షేక్, సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటర డాక్టర్ శ్రావణ్‌కుమార్, పరిశోధకులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణి లేదని తెలువక..

- కలెక్టరేట్‌కు వచ్చిన పలువురు
- కలెక్టర్ లేక.. ప్రజల గోడు వినేవారు కరువు
- ఉసూరుమంటూ ఇంటిదారి


రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌కు వివిధ సమస్యలపై వచ్చిన జిల్లా వాసులు



చేతిలో నీళ్ల సీసా.. జబ్బపై కాటన్ తువ్వాలతో ఉన్న ఈ దంపతులు ఇరుమల్ల కనకవ్వ, కొమురయ్య. బోయినపల్లి మండలం విలాసాగర్. గ్రామంలో డ్రెయినేజీ నీళ్ల పోనీయకుండా.. పైపులైన్ వేయకుండా.. స్థానికులు అడ్డుకుంటున్న సమస్యను ప్రజావాణిలో తెలిపేందుకు వచ్చారు. ప్రజావాణి లేదని తెలియడంతో ఉసూరుమంటూ ఇంటిదారి పట్టారు.

సిరిసిల్ల: ప్రతీ సోమవారం కలెక్టరేట్ నిర్వహించే ప్రజావాణి ఎప్పటి మాదిరిగానే ఈవారం కూడా ఉంటుందనే ఆశలో వచ్చిన పలువురు లేదని తెలిసి ఉసూరుమంటూ వెనుదిరిగారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా రెండు రోజుల ముందే తాను హైదరాబాద్‌కు కోర్టు పనిపై వెళ్తున్నానని, సోమవారం ప్రజావాణి రద్దు చేసినట్లు ప్రకటించారు. ఆ సమాచారం జిల్లా ప్రజలు అందరికీ చేరకపోవడంతో చాలా మంది కలెక్టరేట్ వరకు వచ్చి నిరాశకు గురయ్యారు. వచ్చిన వారిలో అత్యధికులు చదువురాని వారు. ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో ప్రజలకు సమాచారం చేరలేదు. దీంతో ఉదయమే వినతిపత్రాలతో పలువురు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్ అందుబాటులో లేకుంటే.. జిల్లాలో ఉన్న ఇతర ఉన్నతాధికారులు ప్రజావాణి నిర్వహించే అవకాశం ఉంది. గతంలో జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ప్రజావాణి నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి.



వీరు బోయినపల్లి మండలం మర్లపేటకు చెందిన పర్లపల్లి లక్ష్మీ, దుర్గయ్య దంపతులు. ఈ వృద్ధ దంపతులకు బ్యాంకు ఖాతాను స్థానిక బ్యాంకు అధికారులు బతికి ఉండగానే చనిపోయినట్లుగా తొలగించారట. ఆసరా పింఛన్ రావడం లేదని, ఎకరం భూమి ఉన్నా.. బ్యాంకు ఖాతా లేక.. రైతు భరోసా పైసలు రావడం లేదనే సమస్యను విన్నవించేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. కానీ అధికారులు ఎవరూ లేక ఎండలోనే ఇంటిదారి పట్టారు.



ఇతను సిరిసిల్లలోని పద్మనగర్‌కు చెందిన పవర్‌లూమ్ కార్మికుడు పొన్నం నర్సింహులు. భార్య లత బీడీలు చేస్తుంటుంది. కొడుకు చందును ఇంటర్‌తో చదువు మాన్పించి షాపులో పనికి పెట్టాడు. ఇల్లు కుదువబెట్టి ప్రైవేటు బ్యాంకులో రూ.7లక్షలు అప్పు తీసుకున్నాడు. నెల రోజుల కిందటే తల్లి సులోచన మరణించడంతో మళ్లీ అప్పులు అయ్యాయి. సాంచాలు నడిపితే నెలకు వచ్చే రూ.10వేలతో అప్పులు కట్టలేక.. ఇల్లు గడవక ఇబ్బందులు పడుతున్నాడు. కలెక్టర్‌కు కలిసి ఆర్థికసాయం కోసం అర్థించేందుకు నర్సింహులు రాగా ప్రజావాణి లేక నిరాశతో ఇంటిదారి పట్టాడు. ఇలా ఒక్కరు.. ఇద్దరు కాదు.. పదుల సంఖ్యలో కలెక్టరేట్‌కు వచ్చిన జిల్లా వాసులు ప్రజావాణి లేదని తెలిసి నిరాశతో వెళ్లిపోయారు.